క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు నెలాఖరు వరకు గడువు

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం డిగ్రీ ప్రవేశాల గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు బేగంపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలోని అంబేడ్కర్ వర్సిటీ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ మారోజు రామాచారి ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలకు గానూ ఇంటర్మీడియేట్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్ (మూడేళ్లు), ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులని డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలతో పాటు అంతకముందు విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన వారు, అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు చెందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజును సకాలంలో చెల్లించని వారు కూడా దూరవిద్యా విధానం ద్వారా చదువును కొనసాగించవచ్చన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కేటగిరి-1 పీహెచ్‌డీ సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కేటగిరి-1 పీహెచ్‌డీ ప్రవేశాలకు సీట్లను కేటాయించారు. ఇంజినీరింగ్, ఇన్ఫర్మేటిక్స్, లా, సైన్స్, ఆర్ట్స్, సోషల్, ఎడ్యుకేషన్, కామర్స్, ఎంబీఏ తదితర ఫ్యాకల్టీలలో యూజీసీ నెట్, జేఆర్ఎఫ్ అర్హతలు గల విద్యార్థులకు పీహెచ్‌డీ సీట్లను కేటాయించారు. అధ్యాపకుల కొరతతో కేటగిరి-2 పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ను నిలిపివేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జైలు

లాలాపేట: డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మందిలో పలువురికి జైలు, మరికొందరికి జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కోర్టు కానిస్టేబుల్ బాలశివ తెలిపారు. నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మంది పట్టుబడగా వారిని 17వ ఎంఎం కోర్టులో ప్రవేశపెట్టారు. మొదటిసారి పట్టుబడ్డ 14 మందికి ఒక్కొక్కరికి రూ. 2100 చొప్పున జరిమానా, రెండోసారి పట్టుబడ్డ 8 మందికి ఒక్కొక్కరికి రూ. 3300 చొప్పున జరిమానాతో పాటు నాలుగు రోజులు జైలు శిక్ష విధించారు. ఇందులో 18 మంది ద్విచక్ర వాహనదారులు, ముగ్గురు ఫోర్ వీలర్స్ కాగా ఒక్కరు ఆటో డ్రైవర్ ఉన్నారు.

బీసీ సబ్‌కోటాను ప్రకటించాలి

లాలాపేట: ఇటీవల కేంద్ర ప్రభుత్వంలో పార్లమెంట్‌లో ఆమోదించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటాను ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు మణిమంజరీ సాగర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ బీసీల పట్ల వక్షపాత ధోరణి అవలంభిస్తుందన్నారు. పేరుకే మహిళా బిల్లు అని ఆ బిల్లు చాటున అగ్రవర్ణాల పెత్తనమే మళ్లీ చట్టసభల్లోకి వస్తుందన్నారు. ఎమ్మెల్సీ కవిత మహిళా బిల్లు కోసం చేసిన ఉద్యమం ఎంతగానో దోహదపడిందన్నారు. స్వర్ణగౌడ్, సమతాయాదవ్, గౌతమీ, దేవిక, సరోజినీ, పద్మ, రేవతీ, గణకుమారి, సరళ, సరోజ పాల్గొన్నారు.

చీపురు పట్టి.. రోడ్డు ఊడ్చి




రోడ్డు ఊడుస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

రాంగోపాల్‌పేట్: స్వచ్ఛ సురక్షా అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర చీపురు పట్టి స్వయంగా వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌రోడ్, పాన్‌బజార్, బట్టలబజార్ తదితర ప్రాంతాల్లో ఆమె పరిసరాల పరిశుభ్రత గురించి ఆమె స్థానికులకు వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకూడదని, ఇళ్లు, షాపుల యజమానులు స్వచ్ఛ కార్మికులకు చెత్తను అప్పగించాలని సూచించారు. అలాగే అందరికి దీనిపై అవగాహన కల్పించాలని అప్పుడు దేశం మొత్తం పరిశుభ్రంగా ఉంటుందని అన్నారు.

- మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంతో మోదీ చిత్రపటానికి కార్పొరేటర్ చీర సుచిత్ర ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు ఈ బిల్లును తొక్కిపెట్టినా ప్రధాని మోదీ మహిళలు రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టారన్నారు.

వ్యక్తి అదృశ్యం



చిలకలగూడ : ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సబిత వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన విజయప్రసాద్ (26) ఈ నెల 6వ తేదీన ఉద్యోగానికి అని చెప్పి బయటకు వెళ్లి ఎంతకీ రాకపోవడంతో తండ్రి గోవిందప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైలు కిందపడి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నెం- 3 వద్ద గురువారం 30-35 ఏళ్ల వయస్సున్న వ్యక్తి వుణే వెళ్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఎడమ చేతిపై ఇంగ్లిష్‌లో ఎస్ ఎంఎల్‌బీ, కుడిచేతిపై ఎస్‌బీ అని పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



బీకేగూడలో.. వెల్లాల రామ్మోహన్, తలసాని సాయికిరణ్‌యాదవ్ పూజలు



బేగంపేటలో.. పూజలు చేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి



మారేడుపల్లి: పూజల్లో పాల్గొన్న శ్రీగణేశ్

బొజ్జ గణపయ్యా.. వరాలివ్వయ్యా..

- భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రోత్సవాలు
- ప్రత్యేక పూజలు, అన్నదానాలు

గణేష్ నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన బొజ్జ గణపయ్యలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం పలువురు ప్రజాప్రతినిధులు మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండప నిర్వాహకులు సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు, యువకులు నృత్యాలతో అలరిస్తున్నారు.

–సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ల బృందం



సిద్ధి వినాయక మండపంలో..



మోడల్‌కాలనీలోని మండపంలో చిన్నారుల నృత్యం



రసూల్‌పురా గణేష్ మండపంలో..



బోయిన్‌పల్లిలో గణనాథుడిని దర్శించుకున్న మర్రి రాజశేఖర్ రెడ్డి, పాండుయాదవ్, మధుకర్



ఐదోవార్డులో గణేశ్ మండపాన్ని దర్శించుకున్న లాస్య నందిత



వాసవీ నగర్‌లోని మండపంలో రామకృష్ణ-అనురాధ పూజలు



బండిమెట్‌లో పూజలు చేస్తున్న తలసాని సాయి కిరణ్‌యాదవ్

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ప్రదీప్ సింగ్, చాముండేశ్వరీనాథ్

అడ్డగుట్ట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రైల్వే ఏడీఆర్ఎం బి. ప్రదీప్ సింగ్ రాథోడ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లోని విశ్వమాణ్య బ్యాడ్మింటన్ అకాడమీలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో యోనెక్స్ సన్‌రైజ్ 9వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అండర్ 13 బ్యాడ్మింటన్ పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు చాముండేశ్వరినాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని, విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ శాట్స్ సర్వప్ప, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ సంయుక్త కార్యదర్శి యూవీఎన్. బాబు, కనూరి వంశీధర్, విక్రాంత్, కోచ్ నాగరాజు పాల్గొన్నారు.

ఓయూలో బీసీ నేతల రహస్య సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మునుగోడు బీసీ నేతలు రహస్య సమావేశం అయ్యారు. క్యాంపస్‌లోని ల్యాండ్ స్కేప్ గార్డెన్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, బీసీ సంఘాల నేతలు, కుల సంఘాలకు చెందిన సుమారు 75 మంది సమావేశమయ్యారు. గత ఎన్నికల్లో మహాకూటమితో పాటు ఇతర పార్టీలు బీసీలకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వలేదని ఈ సారీ ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దించాలని నిర్ణయించినట్లు బీసీ జేఏసీ ఛైర్మన్ అవ్వారు వేణుకుమార్ తెలిపారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఖాయం

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు చూపుతున్న ఆదరణతో కాంగ్రెస్ పార్టీ గత వైభవాన్ని చాటబోతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా అన్నారు.రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్టలో జరిగిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ విధానాలతో ప్రజలు విసిగిపోయారని కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలను ఓడించి కాంగ్రెస్ జెండాను ఎగురవేయనున్నామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెహ్మాన్ షరీఫ్, మజర్, సోయబ్, మహ్మద్ రియాజ్, లోకేష్ పాల్గొన్నారు.



పార్టీలోకి చేర్చుకుంటున్న నీలిమా

నమ్మకద్రోహానికి మారుపేరు బీజేపీ

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్

రాంగోపాల్‌పేట్: ఎస్సీ వర్గీకరణపై నమ్మకద్రోహం చేసిన బీజేపీ పార్టీని బొందపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్యారడైజ్ చౌరస్తాలో మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అంటే నమ్మకద్రోహం, నయవంచనకు మారుపేరని కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టిన కేంద్ర ప్రభుత్వం 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ మాత్రం ఎందుకు పెట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ కార్యకర్తగా పనిచేస్తానని చెప్పిన మాజీ కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి పార్లమెంటులో ఈ బిల్లు పెట్టకుండా తెలంగాణకు ఏ ముఖం పెట్టుకుని వస్తారో చూస్తామని హెచ్చరించారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లును పెట్టి బీజేపీ తన చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న కార్యకర్తలను మహంకాళి పోలీసులు అడ్డుకోవడంతో కొద్ది సేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మాదిగ మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు జేపీ లత మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదగి జిల్లా కన్వీనర్ నర్సింహ, నాయకులు ఇటుక శ్రీకిషన్ మాదిగ, నాయకులు మల్లికార్జున్ మాదిగ, రాందాస్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ గణేష్ మాదిగ, నవీన్ మాదిగ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా బిల్లును ప్రవేశపెట్టాలి

రాంగోపాల్‌పేట్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను కల్పించే బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) డిమాండ్ చేసింది. గురువారం రెజిమెంటల్‌బజార్‌లోని అమృతవాణి భవనంలోని ఏఐసీఎఫ్ కార్యాలయంలో తెలంగాణాలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు మాట్లాడుతూ.. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా బీజేపీ ప్రభుత్వం వివక్షను చూపిస్తుందన్నారు. అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించబోతున్నామని, దళిత క్రైస్తవ రాజ్యాధికార చైతన్య యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మణి, వనితా అలెగ్జాండర్, మంగేశ్వరి, రాజ్‌కింగ్, బిషన్ దయానంద్, డాక్టర్ ఎస్ అబ్రహాం పాల్గొన్నారు.



ఏఐసీఎఫ్ సమావేశంలో పాల్గొన్న పార్లమెంటరీ పరిశీలకులు

హుండీల ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: అమీర్‌పేట కనకదుర్గాదేవి ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించగా రూ.15,38,824 ఆదాయం వచ్చిందని కార్యనిర్వాహణ అధికారి నరేందర్ తెలిపారు. లెక్కింపులో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్, పాలక మండలి సభ్యులతో పాటు మాజీ కార్పొరేటర్ శేషుకుమారి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

లాలాపేట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి రెండవ విడతలో డబుల్ బెడ్రూమ్‌లకు ఎంపికైన లబ్ధిదారులతో గురువారం లాలాపేటలో ప్రొ. జయశంకర్ స్టేడియంలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు మంచి సదుపాయాలు కల్పించేందుకే ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందన్నారు. దశలవారీగా లాటరీ ప్రక్రియ ద్వారా అర్హులకు మాత్రమే ఇళ్లను కేటాయిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఆర్టీసి బస్సుల్లో జవహర్‌నగర్‌లోని డబుల్ బెడ్రూమ్ వద్దకు వెళ్తున్న లబ్ధిదారులకు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



లబ్ధిదారులతో ముచ్చటిస్తున్న పద్మారావుగౌడ్

మలివిడతలో 300 మందికి 'డబుల్' ఇళ్లు



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి కేటీఆర్, మర్రి, లాస్య నందిత

కంటోన్మెంట్: ఎట్టకేలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ వాసుల్లో 500 మందికి డబుల్ బెడ్రూమ్‌లు దక్కాయి. తొలివిడతలో కేవలం 200 మందికి కేటాయించగా, గురువారం నాటి మలివిడత పంపిణీలో మరో 300 మందికి ఇళ్లు దక్కాయి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి, వెరిఫికేషన్ చేయకపోవడం వల్లే గతంలో కంటోన్మెంట్‌కు తక్కువ సంఖ్యలో ఇళ్లు దక్కాయని బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి లాస్య నందిత అన్నారు. ఈ సమస్యను గుర్తించి అన్ని వార్డుల పరిధిలో డబుల్ ఇళ్ల దరఖాస్తు దారుల వెరిఫికేషన్‌ను వేగవంతం చేశామన్నారు. ఈ మేరకు కంటోన్మెంట్ అధికారుల నుంచి తగిన సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. గురువారం నాటి లబ్దిదారులకు మంత్రి కేటీఆర్, మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి తన చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు. త్వరలోనే మరో వెయ్యి మందికి ఇళ్లు దక్కే అవకాశముందన్నారు.

పోషకాహార భద్రతకూ ఎఫ్‌సీఐ కృషి

సనత్‌నగర్: ఆహార భద్రతకు ప్రాధాన్యమిస్తూనే పోషకాహార భద్రతను ఎఫ్‌సీఐ పర్యవేక్షిస్తోందని ఆ సంస్థ డివిజనల్ జనరల్ మేనేజర్ అభయ్ రాంరావ్ తంగాడే స్పష్టం చేశారు. గోధుమల ధరలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎఫ్‌సీఐ ఏజీఎం (క్వాలిటీ కంట్రోల్) రాజన్‌కుమార్‌తో కలిసి సనత్‌నగర్‌లోని ఎఫ్‌సీఐ గిడ్డంకుల్లోని బియ్యం, గోధుమల నాణ్యతను ఆయన పరిశీలించి మాట్లాడారు. వివిధ ప్రభుత్వ పథకాలకు గోధుమలను అందించే విధంగానే బహిరంగ మార్కెట్‌కు కూడా ఎఫ్‌సీఐ సరఫరా చేస్తోందన్నారు. అర్హులైన వ్యాపారులకు గోధుమలను సరఫరా చేయడం ద్వారా బహిరంగ మార్కెట్లో ధరలను నియంత్రించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. గతేడాది సుమారు 23 మెట్రిక్ టన్నుల గోధుమలను బహిరంగ మార్కెట్ కోసం సరఫరా చేయగా, ఈ సారి 19 మెట్రిక్ టన్నులను సరఫరా చేసినట్లు తెలిపారు. సనత్‌నగర్‌లోని ఎఫ్‌సీఐ డిపో రాష్ట్రంలోనే పురాతనమైందని, ఇక్కడ 64,496 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం ఉందన్నారు. ఈ నెల 14వ తేదీ నాటికి సనత్‌నగర్ డిపో ద్వారా 48,896 మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యం నిల్వ చేయడం జరిగిందన్నారు.



బియ్యం, గోధుమల నాణ్యతను పరిశీలిస్తున్న అభయ్ రాంరావ్ తంగాడే

'ఎమ్మెల్సీ కవిత ప్రకటన హాస్యాస్పదం'

రసూల్‌పురా: తాను లేఖ రాసినందుకు ప్రధాని నరేంద్ర మోదీ మహిళ రిజర్వేషన్ అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ కవిత పేర్కొనడం దురదృష్టకరమని బీజేపీ నాయకురాలు సుష్మిత అన్నారు. బోర్డు రెండవ వార్డు రసూల్‌పురా, బీరప్పగుడి, మూడవ వార్డు బాలంరాయి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో గురువారం ఆమె ప్రత్యేక పూజ చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎంత మంది మహిళలకు ప్రాధాన్యం కల్పించారో ఆ విషయం తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనురాధ, భాగ్యలక్ష్మి, మమత, స్వాతి ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఫెర్టీ-9తో కూపర్ భాగస్వామ్యం

సాక్షి, సిటీబ్యూరో: సంతానోత్పత్తి సేవలు అందించే నగరానికి చెందిన ఫెర్టీ-9 ఫెర్టిలిటీ సెంటర్,అంతర్జాతీయ వైద్య పరికరాల తయారీ సంస్థ కూపర్ సర్జికల్ ఫెర్టిలిటీ సొల్యూషన్స్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. ఈ విషయాన్ని గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రతినిధులు తెలిపారు. సంతానోత్పత్తి పరిష్కారాలను కోరుకునే జంటల కోసం చికిత్స పరంగా అత్యున్నత ప్రమాణాలను అందించే లక్ష్యంతో ఈ భాగస్వామ్యం చేసుకున్నామని, దీని ద్వారా సంతానలేమి సమస్య పరిష్కారాలకు సంబంధించి విజయాల రేటు పెంచడం, లోపాలను తగ్గించడం దిశగా అత్యాధునిక సాంకేతికత అంతర్జాతీయ నైపుణ్యం అందిపుచ్చుకోవడం సాధ్యమవుతుందన్నారు.

కంటోన్మెంట్ టీపీటీ బకాయిలు చెల్లించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- జాప్యం చేస్తే వడ్డీతో పాటు ఆర్మీ వెల్ఫేర్‌కు నిధులివ్వాలంటూ ఉత్తర్వులు



కంటోన్మెంట్: ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ (టీపీటీ) బకాయిల చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పదే పదే జాప్యం చేస్తూ ఉండటం పట్ల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు చెల్లించాల్సిన రూ.33.42 కోట్ల బకాయిలను ఎనిమిది వారాల్లో చెల్లించాలని ఆదేశించింది. ఆలస్యం చేస్తే ఏడాదికి 12 శాతం వడ్డీతో పాటు, ప్రతి నెలా రూ. లక్ష చొప్పున ఆర్మీ వెల్ఫేర్ ఫండ్‌కు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. గతంలోనూ హైకోర్టు ఆదేశాలతో రూ.46 కోట్ల బకాయిలు చెల్లించిందని బోర్డు సభ్యుడు రామకృష్ణ గుర్తు చేశారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కంటోన్మెంట్ సమస్యల పరిష్కారంలో కోర్టుకెళితేనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం దారుణమని రామకృష్ణ అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉచిత నీరు ఇస్తూ కంటోన్మెంట్‌కు ఇవ్వకపోవడంపై తాను హైకోర్టుకు వెళ్లడంతోనే, ఇక్కడా వర్తింప చేసినట్లు తెలిపారు. టీపీటీ విషయంలో రెండుసార్లు కోర్టుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి, కంటోన్మెంట్ వాసుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఏమిటీ టీపీటీ?

రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆస్తుల రిజిస్ట్రేషన్‌లలో స్టాంప్ డ్యూటీ 4 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5 శాతం ఉండగా, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ (టీపీటీ) 1.5 శాతంగా ఉంది. 2014కు ముందు టీపీటీ 5 శాతంగా ఉండేది. ఈ మొత్తాన్ని నేరుగా సంబంధిత స్థానిక సంస్థలకు చెల్లించే వారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం టీపీటీని 1.5 శాతానికి తగ్గించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అధికారుల ఆధ్వర్యంలో పాలన సాగే కంటోన్మెంట్‌లో మాత్రం యధావిధిగా 5 శాతాన్ని కొనసాగిస్తూ వచ్చారు. అయితే గతంలో ప్రతి నెలా నేరుగా కంటోన్మెంట్ బోర్డుకు చెల్లించే టీపీటీని రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాలోకి మళ్లించుకుంటోంది.

- ఏళ్ల తరబడి ఈ బకాయిలు చెల్లించక పోవడంతో 2019 నాటికి రూ.80 కోట్లకు చేరాయి. కంటోన్మెంట్ అధికారుల ఒత్తిడితో కొంత మేర చెల్లిస్తూ వచ్చారు.
- ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో గతేడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.46 కోట్ల బకాయిలను చెల్లించింది. మరో రూ.33.42 కోట్ల బకాయిలు కోసం బోర్డు అధికారులు ప్రయత్నించినా స్పందించకపోవడంతో ఆయన మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.